ఈ కథలోనే చెప్పదల్చుకుంది సిగిరెట్టుతో సీత కన్‌ఫ్రంటేషన్‌ని గూర్చి కానీ. సిగిరెట్టుకి శివరాజుతో ఉండుతున్న ఫ్రెండ్‌షిప్‌నిగూర్చి మాత్రంకాదు.

ఈ శివరాజనే శాస్త్రీ ఉన్నాడే ఇతను పొగత్రాగే వాళ్ళందరిలో తలమానికం లాంటివాడు. ఈ ప్రపంచంలో సిగరెట్టుని సేవించు శిరోమణులంతా ఒక సంఘంగా ఏర్పడితే, నిస్సందేహంగా ఆ ఎసోసియేషన్‌కి ప్రెసిడెంటు కావల్సినవాడు లేదా వీళ్ళంతా కలిసి ఒక రివల్యూషన్ లేవదలుచుకుంటే, ఆ విప్లవానికి నాయకుడు కావలసినవాడు.

ఇక రెండో వ్యక్తి సీతామహాలక్ష్మి. ఈ అమ్మాయికి సిగరెట్టు తాగేవాళ్ళంటే కిట్టదు. మరావిడ రైలింజనులాంటి శివరాజుని ఎలా ప్రేమించింది అంటే – లవ్ ఈజ్ బ్లైండ్ అన్నారు కదండీ! అంటే ప్రేమలో ఆ అమ్మాయి కళ్ళురెండూ మూసుకుపోయాయని కాదు గానీ, ఈ పొగతాగటాన్ని ఓవర్‌లుక్ చేసేటంతటి శివరాజులోని మంచితనం, మరేదో బుద్ధిమంతనం సీత కళ్ళని చీకట్లు కమ్మేలా చేశాయి. ఆ మత్తు వదిలించుకుని కళ్ళిప్పేసరికి శివరాజు తాగే సిగరెట్టుపొగలోంచి వచ్చిన ఈ ప్రపంచాన్నే కప్పేస్తున్నట్లుగా కన్పించింది.

అసలు శివరాజుకీ, సీతామహాలక్ష్మికీ ఎలా పరిచయం ఏర్పడిందో చెప్పాలిగా!

ఆ అమ్మాయి ఒకసారి వాళ్ళ అన్నయ్య వెంబడి వాళ్ళ చిన్నాన్నగారి కూతురి పెళ్ళికి వెళ్ళింది.

అక్కడికి పెళ్ళికిముందురోజే వెళ్ళారు. వెళ్ళిన ఒక గంటసేపటికి ఒకే హడావిడిగా తిరుగుతోంది సీత. అంతలో వాళ్ళన్నయ్య ఎర్రగా, పొడుగ్గా ఉండి చేతిలో సిగిరెట్టు పీకతో ఉన్న ఓ కుర్రాడితో తిరుగుతూ కన్పించి, అటుగా వెళ్తున్న సీతని దగ్గిరగా పిల్చి పరిచయం చేశాడు.

"సీతా! యూనివర్శిటీలో నా డియరెస్ట్ ఫ్రెండ్ శివరాజని చెప్పేవాడినే, ఇడిగో వీడే. శివా! షి యీజ్ మై సిస్టర్ సీత" అన్నాడు.

పూర్తి పేరు చెప్పడం వీడికి నామోషి కాబోలు అనుకుంది సీత. "ఇంతలో గ్లాడ్ టు మీట్ యూ" అనటంవినిపించి ఆ శాల్తీకేసిచూస్తో "థాంక్‌యూ" అని తను అనగలిగినంత స్టయిల్‌గా అనివెళ్ళిపోబోయింది. పోతూ ఒక్కసారి మళ్ళీ వెనక్కి తిరిగిన సీతకి అతనిటే చూస్తూండటం కన్పించింది. నీట్‌గా షేవ్ చేసుకుని, లేత నీలం రంగులో మెరుస్తున్న గడ్డం, స్టయిల్‌గా పెంచిన చిన్న మీసం, చింపాంజీలా మెడలమీదా, చెంపలమీదా జుట్టు వదులుకోకుండా నీట్‌గా ఉన్న క్రాపూ – బాగానే వున్నాడు అనుకుంది. అంతలో అతడి ఎర్రటి పెదవుల మధ్యని ఉన్న సిగరెట్ కన్పించింది. ఛ! అదొక్కటే అవలక్షణం అనుకుంది సీత చిరాగ్గా. అయినా ఇతనికిదేం పాడుబుద్ధో అనుకుంది మరింత చిరాగ్గా. అంతలో జ్ఞానోదయం అయి, అయినా మధ్యలో నాకేవిట్లే– ఏ ఏట్లోనన్నాపడనీ అనుకుని విసవిసా వెళ్ళిపోయింది.

పాపం!– ఆ వయ్యారినే గమనిస్తున్న శివరాజుకి, ఆమె నడకలో కన్పించిన కోపానికి కారణమేవిటో బోధపడలేదు. ఏమై ఉంటుందా అని తీరిగ్గా సిగరెట్టుపొగ వదుల్తూ మరీ ఆలోచించాడు.

శివరాజు పెళ్ళికొడుకు తరపునవచ్చేడు. సీత అన్నయ్య పెళ్ళికూతురి వయిపే అయినా, "శివరాజుతోపాటే పెళ్ళికొడుకు వాళ్ళ గుంపులో చేరిపోయాడు.

మరుసటిరోజు అంటే ముహూర్తం రోజున ఉదయం, వాళ్ళపిన్ని దగ్గర ఏదో సహాయం చేస్తున్న సీత దగ్గిరికిచేరి, వాళ్ళన్నయ్య మెల్లిగా శివరాజుకి రెండో ట్రిప్పు కాఫీకావాల్ని ఎక్కడేనా దొరుకు




# సిగరెట్టూ — సీతామహాలక్ష్మి

డి. విజయలక్ష్మి

తుందేమో కాస్త చూడమని బతిమాలుతున్నాడు.

శివరాజు పేరు వినగానే ఆ అమ్మాయి నెవరో పట్టి లాగినట్లయింది. నిన్నతన్ని చూసినప్పట్నించీ అంత హడావిడిలోనూ రెండు సార్లు గుర్తుచేసుకుంది అతని ముఖారవిందాన్ని సీత. శివరాజు కోసం అనగానే ఎల్లాగోలా ఇల్లంతా గాలించి

రెండు కప్పుల కాఫీ సంపాదించి పట్టి కెళ్ళింది.

ఈ అమ్మాయి వేళ్ళేసరికి ఒకచిన్న గూడెంలాంటి రూములో స్నేహితులిద్దరూ సిగరెట్లు లాగేస్తున్నారు. సీత వస్తున్న అలికిడి వినగానే వాళ్ళన్నయ్య గబుక్కుని (సీత వదినకి ఎక్కడ చెబుతుందో అనే భయంతో) సిగరెట్టు పీకని జంబుఖానా కింద దాచేశాడు.

సీతకి వళ్ళు మండింది ఇది చూసి. ఇలాంటి మహానుభావులే మా అన్నయ్య లాంటి బుద్ధిమంతులికి కూడా పాడు అల వాట్లు మప్పుతారు అనుకుని కాఫీ ఫ్లాస్కుని కోపంగా వాళ్ళిద్దరి నెత్తినా విసిరినంత పన్జేసి వెళ్ళిపోయింది.

శివరాజు బిత్తరపోయాడు.

శివరాజుకి అమ్మాయిల అందాన్ని వర్ణించగల కవితాహృదయం లేకపోయినా, చిన్నచూసినప్పుడే ఈ రెండుజెడలమ్మాయి చక్కగా వుంది కదూ! అనుకున్నాడు. ఇంతలో ఈ పిడుగు! "ఈ అమ్మాయికి నామీదింతకోపంఎందుకు!" అనుకున్నాడు. పాపం! శివరాజు కేం తెలుసూ, ఈ పిల్ల తన ప్రాణానికి ప్రాణమైన సిగరెట్టుకే ఎసరు పెటబోతోందని.

అవాళ రాత్రి పది గంటలకి ముహూర్తం. సీత పెళ్ళికూతుర్ని తయారు చెయ్యటంలో సాయంత్రం నించి బిజీగా ఉండిపోయింది.

పెళ్ళి కూతుర్ని పీటలమీద కూచోబెట్టటానికి తీసికెళ్ళిపోయాను. పందిరి దగ్గిరికి వెళ్ళిన సీతకి ఉన్నట్లుండి శివరాజు గుర్తొచ్చాడు. చుట్టూ చూసింది — ఎక్కడా కన్పించలే. తన బట్టలు ఎక్కువ నలిగి పట్లనిపించింది. డ్రెస్సు మారుద్దామని లోపలికెళ్ళిపోయింది — ఇంకా మంగళ సూత్రధారణకి టయిముంది కదాని.

చీర మార్చుకుని గదిలోంచి బయట పడేసరికి, ఎదురుగా శివరాజు తచ్చాడుతూ కన్పించాడు.

ఆ క్షణంలో సీతకి పొద్దుటి కోపం గుర్తురాలేదు.

"ఏం కావాలండీ?" అని సౌమ్యంగా అడిగింది. కాస్త తటపటాయించి, "కొంచెం నిప్పుపెట్టె కావాలి చూస్తారూ?" అన్నాడు శివరాజు అభ్యర్థిస్తున్నట్లుగా.

ఏ కళనుందో సీతకోపం రాలేదు. కానీ, "ఇతనికి నిజంగా అగ్గిపెట్టే కావాలిసిఉంటే బయటెవ్వరి దగ్గరా దొరకదా ఏంవిటి? అసలు కారణం అదికాదు.... అది కాదు...." అనుకుంది. "అదికాకుంటే మరేమిటి?" అనుకుంటే జవాబు తోచలేదు. అయినా ఇంత గొడవెందు కను కుని, ఎక్కడినించో ఒక అగ్గిపెట్టె తెచ్చిచ్చింది.

దాన్ని అందుకుంటూ, చాలా లైట్‌గా అనాలని ప్రయత్నిస్తూ,

"చూడండీ మీకెందుకంత కోపం నా మీద?" అన్నాడు శివరాజు.

"ఓహో! అదా సంగతి?" అనుకుని "నా కోపమల్లా మీ సిగరెట్టుమీదేనండి. అయినా మీమీదెందుకూ కోపం? ఇంకా నిజం చెప్పాలంటే..." అంది.

"నిజం చెప్పాలంటే .... ఏంవిటి?.... చెప్పండి..."

"అహా! ఎందుకులెండి" అని పోబోయింది సీత గబగబా.

"ఇదుగో .... ఏమండోయ్! ఒక్క క్షణం! ... నేనూ వస్తున్నాగా?" అన్నాడు శివరాజు.

సీత గబుక్కున వెనక్కి తిరిగి "అమ్మో! .... ఇద్దరం కలిసే.... ఎవరేనా చూస్తే...." అంది కళ్ళు గుండ్రంగా తిప్పుతూ.

"అవును... ఎవరేనా చూస్తే...." అని ఆమెని ఇమిటేట్ చేస్తూ కళ్ళు తిప్పేడు శివరాజు.

"అబ్బో! గట్టివాడే" అనుకుని అక్కడ ఓ నిమిషంకూడా ఆగకుండా [illegible] పరిగెత్తింది సీత.

పందిరి దగ్గర మంగళ సూత్రధారణ జరిగేప్పుడు సరిగ్గా శివరాజేం చేస్తున్నాడో అని చూసింది. అతను మండపం వేపు చూడకుండా తన పక్కే చూడటం కన్పించింది. తనలో తనే తియ్యగా సిగ్గుపడి, వధూవరుల వైపు దృష్టి సారించింది.

పెళ్ళయిపోయింది. కథకంచికీ మనం ఇంటికీ అన్నట్లు అందరూ ఎవరిళ్ళ దార్లు వాళ్ళు పట్టేరు. మళ్ళీ శివరాజు, సీతా కల్సుకోటం పళ్లేదు.

సీత చిన్నప్పుడు అంటే కొత్తగా కథలు నవలలూ చదవటం మొదలెట్టాక ఎథ్లెటిక్ ఛాంపియన్ లా కండలు తిరిగిన కుర్రాడిని బ్రహ్మాండంగా ప్రేమించేసి, ఎడ్వెంచరస్‌గా పెళ్ళి చేసుకోవాలనుకునేది.

పాపం సీత ఎథ్లెటిక్ ఛాంపియన్ లా కాకుండా, చాలా ఆర్డినరీగా ఉన్న శివరాజుని బ్రహ్మాండంగా ప్రేమించడం అవుతే చేసింది కానీ, ఎడ్వెంచరస్ మారేజ్ చేసుకుందామనుకున్న ఆమె కలని వాళ్ళన్నయ్య భగ్నం చేశాడు.

సీత నాన్న సీతకి సమ్బంధాలు చూట్టం మొదలెట్టాక కొన్నాళ్ళకి వాళ్ళన్నయ్య ఆయనకి శివరాజు గురించి చెప్పాడు. ఎమ్మే చదివి లక్షణంగా లెక్చరర్ పని చేసుకుంటున్న శివరాజులో ఆయనకి లోపమేదీ కన్పించలేదు. పెళ్ళిచూపులకి రమ్మని రాయమన్నాడు.

"పెళ్ళిచూపు లయిపోయాయిలెండి నాన్నా" అంటూ అంతా చెప్పేడు సీత అన్నయ్య.

"పరేలేవోయ్! ఆ వేషాలన్నీ మన దగ్గర కాదు. లాంఛనం అంటే అలా జరగాల్సిందే!" అని ఉత్తరం రాసెయ్యమని మరోసారి చెప్పేడు సీత నాన్న.

శివరాజుకి అమ్మా నాన్నా లేరు, నాన్న


# అఖిల భారత పాప్యులారిటీ పోటీ

ఎంట్రీ ఫీజు లేదు-మీరు బహుమతిని గెలుపొందగలరు.

బహోయమునకు 60 మొత్తంగల నమూనా.

| | | |
|---|---|---|
| 19 | 18 | 23 |
| 24 | 20 | 16 |
| 17 | 22 | 21 |

మొదటి బహుమతి : రాజదూత్ మోటారు సైకిలు లేదా టెలివిజన్ సెట్టు. 2వ బహుమతి: ఒక టేపు రికార్డరు లేక ఆటోమాటిక్ కెమెరా. 3వ బహుమతి : (100 టోయో జపాన్ మోడల్ 3 బ్యాండ్ ఆల్ వరల్డు ట్రాన్సిస్టరు ధర: రు. 275/-లో సగం ధర. ప్రతి కుటుంబమునకు జీవితకాలపు బహుమతులు

| | | |
|---|---|---|
| | | |
| | | |
| | | |

ప్రమోటర్ల తీర్మానము ఖాయమైనది.

17 (పదిహేడు)నుంచి 25 (ఇరువదిఅయిదు వరకుగల అంకెలను నిలువుగా, అడ్డముగా, అయిమూలగా, ఎటుకూడినా మొత్తం 63 (అరవై మూడు) వచ్చునట్లు ఒక అంకెను ఒకేసారి ఉపయోగించి పై ఖాళీ గడులను పూరించాలి. ఎంట్రీలకు సాదా కాగితం ఉపయోగించాలి. బహుమతి గెలుపొందినవాడు బహుమతికి సంబంధించిన పోస్టేజీ, ప్యాకింగ్, లైసెన్సు ఫీజు చెల్లించాలి. ఎంట్రీలు హిందీ లేక ఇంగ్లీషులో పంపాలి. ఫలితముల కొరకు 45 పైసల స్టాంపులు పంపాలి.

ఆఖరి క్లోజింగ తేదీ : 14-7-74 ఫలితం తేదీ : 15-7-74

DIRECTOR-CROWNAGENCIES(WAJ-63)P.O.BOXNO.1186DELHI-6

చిన్నప్పుడే పోయేడు. అమ్మ ఏడాదిక్రితం గతించింది. అతనిప్పుడు ఒంటిగాడన్నమాట.

సీత అన్నయ్యా దగ్గర్నించి ఉత్తరం చూడగానే ఎగిరి గంతేశాడు శివరాజు. ఎందుకంటే అతనికి సీతనుచూసి వెళ్ళినప్పట్నించీ ప్రతిరోజూ, సీతే కన్పిస్తోంది కలల్లో. ఆమెతో హాయిగా షికార్లు కొట్టినట్లు ఎన్నో ఈస్ట్‌మన్ కలర్ కలలొచ్చాయి. ఇహ నిజంగానే షికార్లు కొట్టొచ్చు ఇంచక్కా అని మురిసిపొయ్యాడు. ఆ రెండు జడలమ్మాయి పొగరణచొచ్చు అనికూడా అనుకున్నాడు.

అంతలో అతనికో అనుమానం వొచ్చింది – సీత పెళ్ళయాకకూడా రెండు జడలేసుకుంటుందా? — అని.

మళ్ళీ తనే రామాయణంలో పిడకల వేటలా, ఈ జడల సంగతేమిటి! అనుకుని ఏం చేద్దామూ! అని సీరియస్‌గా ఆలోచించాడు శివరాజు.

మొదట్లో తిరుగు టపాలో ఉత్తరం రాసేద్దామనుకున్నాడు తానొస్తున్నట్లుగా. కాని చివరికి తిరుగు టపాలో తానే వెళ్ళి సీతముందు వాలేడు.

అలా వెళ్ళి వాలిన శివరాజు, కతికితే అతకదు అని ఏడ్చే వాళ్ళెవరూ లేక పోవటం మూలాన్న పెళ్ళి చూపుల తర్వాత, మూడు రోజులపాటు, కాబోయే అల్లుడి హోదాలో అక్కడే బైఠాయించేడు.

సీత వదినె సీతని నిలేసి అడిగింది మెల్లగా. "ఏవమ్మో! నీకేంటి! అతనొప్పుకున్నట్లే! ముహూర్తమెప్పుడో తెల్సుకునికాని వెళ్ళేలా లేడు మరి" అంది.

తమాషా చూశారా. సీతకప్పుడు శివరాజు సిగరెట్ల విషయం గుర్తే రాలేదు.

చక్కగా బొమ్మలా సిగ్గుపడుతూ, "ఫో! వదినా! నీదంతా మరీనూ!" అంటూ అక్కడ్నించి పరిగెట్టిపోయింది.

"అదేమిటమ్మో! పెళ్ళి చేసుకుని పరిగెత్తేదానివి నువ్వా! మధ్యని నేనెక్కడికెళ్ళనూ!...." అంది సాగదీసూ సీత వదిన.

అవాళ సాయంత్రం సినిమా ప్రోగ్రాం వేశారు. మొదట్లో నలుగురూ వెళ్ళాలనే అనుకున్నారు. కానీ తీరా బయల్దేరే సమయానికి సీత అన్నయ్యా, వదినే దిగబడిపోయారు ఏవో కుంటి సాకుల్తో.

సీతా, శివరాజు లోపల్లోపలే సంతోషిస్తూ పైకిమాత్రం నంగనాచుల్లా మొహాలతో ఇంట్లోంచి బయటపడ్డారు.

షోగ్గా సిగరెట్టు కాలుస్తూ నడుస్తున్నాడు శివరాజు. ఇంతలో సీత రెండు జెడలగూర్చి గుర్తుకొచ్చింది- పక్కకి తిరిగి చూశారు. చక్కగా వాలుజడ వేసుకుని అర్థశేరు జాజులు తురుముకుంది సీత. "అరె! ఇల్లాగే బావుందే!" అనుకున్నాడు.

"పెళ్ళయాక కూడా రెండు జెళ్ళేసుకుంటావా సీతా!" అని అడగాలనుకున్న ప్రశ్నని విత్‌డ్రా చేసుకున్నాడు.

శివరాజు స్వగతం ఇలా ఉండగా, అతను తాగుతున్న సిగరెట్టుని చూడగానే ఉలిక్కిపడిన సీత తలకాయని ఒకటే సందేహం నమిలేస్తోంది. 'సిగరెట్లు మానమని ఎలా చెప్పాలా ఈయనకి" అని.


ఇంతలో థియేటర్ వచ్చింది. లోపలికెళ్ళి కూర్చున్నారు. కాస్సేపు ఏవో ఉబుసుపోక కబుర్లాడుకున్నారు- సినిమాల గురించి, పుస్తకాల గురించీ. ఒకటేమిటి ప్రపంచంలోని అన్ని విషయాల గురించీని.

సీతకి శివరాజు ఛెయిన్ స్మోకింగ్ చూస్తే భయంవేసింది. మెల్లిగా దండయాత్రకి ఉపోద్ఘాతం వేసింది.

"ప్రపంచంలో ఉన్న ఆడాళ్ళలో ఎక్కువ మంది ఎందుకు స్మోక్ చెయ్యరో నాకిప్పుడు తెలుస్తోంది." అంది.

"ఎందుకూ?" అనుకున్నాడు శివరాజు ఎందుకో చెబుతావని. ఊహు! బుర్రకి తట్టలే.

లాభం లేదనుకుని "ఎందుకూ" అడిగాడు అమాయకంగా. సీత లోపల్లోపలే పళ్ళు




మాయకుని "పక్కనున్న మగాళ్ళ సిగరెట్టుమీద సిగరెట్టు లాగేస్తూంటే ఆ వాసనా, పొగ హాయిగా పీలుస్తోంటేపోలా! వేరే మళ్ళీ వాళ్లు కాల్చటం ఎందుకూ! దండగ!" అంది.

శివరాజుకి సీత ఎటాక్ తెలిసిపోయింది. గతుక్కుమన్నాడు. కక్కిన పేనల్లే ఉండిపోయి, దిక్కులు చూస్తో. ఈ పిల్ల ఇప్పుడే ఇలా దండయాత్ర స్టార్ట్ చేసిందే ముందెలారా భగవాన్!" అనుకున్నాడు.

కొన్సేపయాక సీతకే జాలేసింది శివరాజు మీద. మొదట్లోనే ఇంతలా బెదిరిస్తే మరీ అన్యాయంగా ఉంటుందనుకుని చాలా సౌమ్యంగా అడిగింది.

"ఏఁవండీ మీరీ సిగరెట్లు మానెయ్యలేరూ?" అంది.

"ఏం? నువ్వుగానీ తాగుదామనుకుంటున్నావేమిటి?" అన్నాడు శివరాజు టక్కుని 'హాయ్! దెబ్బ తీశానా!' అనుకుని.

'అమ్మో! గట్టివాడే. నా మాట నాకే అప్పగించేశాడు' అనుకుని "తమాషాకేం కానీ. నిజం చెప్పండి... మానెయ్యలేరూ స్మోకింగ్!" అంది అర్థింపుగా.

"అయినా ఇప్పుడేమంత అవసరం వచ్చిందోయ్ మానెయ్యటానికి!"

"ఆ?! మానెయ్యటానికి అవసరం కావాలేమిటి? స్మోకింగ్‌వల్ల హెల్త్ స్పాయిల్ అవుతుందని మీకు తెలియదేం!"

"అబ్బో! నేను హైస్కూల్లో చదువుకునేప్పట్నించి తాగుతున్నాను. నాకే రోగమూ లేదు. దుక్కలా ఉన్నానుగా!"

ఇంకా ఏమనాలో సీతకి తోచలేదు. చివరికి ఎప్రోచ్ చెయ్యాల్సిం దిలాకాదు అనుకుని, మెల్లిగా గొణిగింది. "మరి.... మరి నాకి స్మెల్ సరిపోదండీ. డోకొచ్చినట్టవుతుందీ" అని.

ఉలిక్కిపడ్డాడు శివరాజు, గబుక్కున చేతిలో ఉన్న సిగరెట్టు పీకని కిందపారేసి, "అయామ్ సారీ సీతా! ... ఈ విషయం

ముందే ఎందుకు చెప్పలేదు? .... మానటం కష్టమే అనుకో అయినా ప్రయత్నిస్తాను. మరి.... ఐ ఫీల్ వెరీసారీ సీతా దట్ ఐ హావ్ ట్రబుల్డ్ యూ ఎ లాట్" అన్నాడు.

పిచ్చివాడు! అతనిప్పటికి అయిదారు సిగరెట్లులాగి ఉంటాడు. సీతకి దోకొచ్చే దవుతే ఈపాటికి రావాల్సిందిగా మరి. తన పాచిక పారినందుకు నవ్వుకుంది సీత "అబ్బ! నేనంటే ఎంత ప్రేమ శివరాజుకి అనుకుని పొంగిపోయింది.

తరవాత నెల తిరిగే సరికల్లా, చి. కుం. సౌ. సీతామహాలక్ష్మిని చిరంజీవి శివరాజు కిచ్చి, ఓ శుభలగ్నంలో, ఆకాశమంత పందిరికింద బ్రహ్మాండంగా పెళ్ళిచేశాడు సీత నాన్న.

సీతమ్మ శివరాజు అర్థాంగి అయి పోయింది. ప్రేమతో సీతా శివరాజుల మధ్య ఏర్పడ్డ చక్కని అనుబంధం పెళ్ళితో మరింత చిక్కగాఅయింది. కానీ ఆచిక్కటి అనుబంధంలో సిగరెట్టు ముల్లులా చిక్కడి పోయింది.

ఆ ముల్లుని బయటికి లాగెయ్యాలని సీత పట్టుదల, అదే ముల్లుని పువ్వుగా కన్విన్స్ చేయాలని శివరాజు తాపత్రయం.

మొదటిరాత్రి చక్కగా అలంకరించు కుని శివరాజు దగ్గరికి వెళ్ళింది సీత. శివరాజు సీరియస్‌గా ఏదో ఆలోచిస్తోన్నాడు

అతనేం ఆలోచిస్తున్నాడో సీతకి. అంతుపట్టలేదు.

మెల్లిగా దగ్గిరికి వెళ్ళి అతని భుజం మీద చేయేసి "ఏఁవిటీ? అంత ఆలోచన?" అంది.

నెమ్మదిగా ఆమె చేతిని తన చేతిలోకి తీసుకుంటూ,...."మరేమీలేదు సీతా!... వెధవది ఈ సిగరెట్టు తాగడమనేదుంది చూశావూ - ప్రాణానికి అలవాటు పడిపోయింది....ఇప్పుడు మానెయ్యాలంటే ఎంత హెడేక్- తెలుసా?....వాసనేగా నీకు నచ్చనిది? .... నిదానంగా అలవాటు చేసుకుందూ!....ప్లీజ్!" అన్నాడు శివరాజు.

సీతకి నెత్తిన రాయి పడ్డట్టయింది. గబుక్కుని తన చేతిని లాగేసుకుంది.

శివరాజు కిదేం పట్టలేదు. మెల్లిగా ఓ కొత్త సిగరెట్టు పెట్టెని ఓపెన్‌చేసి, సరికొత్త సిగరెట్టుని బయటికి తీసి, జాగ్రత్తగా రెండుకొసలూ సాపుచేసుకుని, నాజూగ్గా రెండు వేళ్ళమధ్యని పట్టు కున్నాడు.

"సీతా! తెల్లగా మెరిసిపోతూ పెళ్ళి కూతుర్లా ఎంత చక్కగా ఉందో చూశావా? ఇది" అన్నాడు.

సీతకి వళ్ళు మండింది. అందమయిన అసలయిన పెళ్ళికూతుర్ని ఎదురుగుండా వుంచుకుని, వెధవది సిగరెట్టుని పట్టుకుని పెళ్ళికూతురూ, గాడిద గుడ్డూ అంటాడా అనుకుంది కసిగా.

"అయితే మానటం అంటూ లేదన్న మాట!...."

"అయ్యయ్యో ఎంత మాట! అసలూ కన్యాశుల్కంలో గిరీశం ఏమన్నాడో తెలుసా సీతా?

"ఖగపతి యమృతముతేగా
భుగభుగమనిపొంగి చుక్క భూమిని వ్రాలెన్.
పొగచెట్టై జన్మించెను
పొగ తాగనివాడు దున్నపోతై పుట్టున్
అన్నాడు చెప్పవోయ్! నేను దున్నపోతై పుట్టాల్సిందా నీకు?"

శివరాజు వేసే జోక్స్ విని ఆనందించే ఓపిక లేకపోయింది సీతకి. గంపెడాశతో వచ్చిన ఆ పిల్లకి అప్పటికే శివరాజు చచ్చు కబుర్లు విని, విసిగి కళ్ళనీళ్ళ పర్యంతమయింది.

"అలా అవుతే నేనెందుకూ? చక్కగా సిగరెట్టు కాలుస్తూ కూర్చోండి...." అంటూ రోషంగా వెళ్ళిపోబోయింది.

శివరాజుకి జాలేసింది.

"అఁ! అఁ!.... ఏఁవిటది?...." అని సీత జడపట్టి ఆపుతూ "అంత తొందర

యితే ఎలాగబ్బా!.... మొత్తానికి నీది భలే షార్ట్ టెంపరోయ్" అంటూ మెల్లిగా మీదికి లాక్కున్నాడు.

సీత ఏమీ అన్లేదు. కళ్ళనిండా నిండిన నీళ్ళు బయటికొచ్చేశాయి శివరాజు దగ్గరికి తీసుకోగానే.

"ఛ!....ఏఁవిటిది? .... నేనేదో తమాషాకి అంటే" అంటూ కళ్ళు తుడిచాడు శివరాజు.

"అయితే!... సిగరెట్లు మానేస్తారుగా" అంది వెక్కుతూ.

"అదికాదు సీతా!....ఇంత ఎక్కువగా తాగేవాణ్ణి ఒక్కసారిగా మానెయ్యాలంటే ఎంత కష్టమో తెలుసా? .... నిదానంగా తగ్గిస్తానుగా!"

అప్పటికదే చాలన్నట్లు ఏడుపు మానేసింది సీత.

తరవాత నాలుగు రోజులకు సీత కాపరాని కెళ్ళిపోయింది.

ఏ అమ్మాయయినా పెళ్ళయిన కొత్తలో ప్రతిక్షణమూ మొగుడు తన దగ్గరే ఉండాలనుకుంటుంది. ఎన్నోసార్లు, ఎంతోసేపు అతని స్పర్శని చవిచూస్తున్నా ప్రతిసారీ అతను దగ్గరికి తీసుకున్నప్పుడల్లా పిచ్చిదై పోతుంది.

సీతమీద శివరాజు ఈ ట్రిక్కునే ప్రయోగించాడు. ఏ విషయంలోనయినా ఆమె కాస్త ఎటాక్ చేయటానికి ప్రయత్నిస్తోన్నట్లు కన్పించినా వెంటనే ఆ నోరు మూయించి పిచ్చిదాన్ని చేసేవాడు.

అవాళ సాయంత్రం శివరాజూ, సీతా సినిమా కెళదామనుకున్నారు. శివరాజు తయారయిపోయి సీతకోసం వెయిట్ చేస్తూ కూచున్నాడు. సీత ఎల్లాగూ త్వరగా తెమలదు. ఇంతలో సిగరెట్ ఒకటి లాగించేద్దామనుకున్నాడు. ఎందుకంటే ఇంక సినిమాలో ఉన్నంతసేపూ బయటికి వెళ్ళనివ్వదు. దగ్గిర కూచుని మూడు గంటలూ సిగరెట్టూ ముట్టనియ్యదు.

సీత తీరిగ్గా ముఖం కడుక్కుని, మేకప్ చేసుకుని, తనకీ, ముఖ్యంగా శివరాజుకీ ఇష్టమైన తెల్లంచు, లైట్‌గ్రీన్ చీరని ధరించి, మూడు నిమిషాలపాటూ కుచ్చెళ్ళు సర్దుకుని బయటికి వచ్చింది ఎంతో ఆత్రుతగా—బయటికి రాగానే శివరాజు చూస్తాడు. వెరీ ఫైన్ సీతా! అని మెచ్చుకుంటాడూ—అని ఆశగా వచ్చింది.

కానీ జరిగింది వేరు. శివరాజు కిటికీ దగ్గర నుంచుని చిదానందంగా సిగరెట్టు తాగుతూ, అందులోంచి వచ్చే పొగలరింగుల్ని చూసి తాదాత్మ్యం చెందుతూ వేరే లోకంలో ఉన్నాడు.

శివరాజు భుజానికి కాస్త ఎడంగా వచ్చి నాలుగైదు క్షణాలపాటు నిల్చుంది. సీత గమ్మున,

ఉహూ! శివరాజు పరిస్థితిలో మార్పులేదు సీతకి ఛర్రున మండింది. సినిమా ప్రోగ్రాము కాన్సిల్ చేసి పారేద్దామనిపించింది. శివరాజుని ఛడామడా పీకేద్దామన్పించింది. ఇంకా ఏదో చేద్దామన్పించింది సీతకి ఆ కోపంలో.

సీత కోపం తాలూకు వేడి తగిలికాబోలు శివరాజు ఉలిక్కిపడి ఇటు తిరిగాడు.

అప్సరసలా ఎదురుగుండా సీత! కానీ ఆమె గరళాన్ని కక్కటానికి సిద్ధంగా


డా॥ పి.వి.కె.రావ్, B.A. సెక్స్ స్పెషలిస్ట్.



వైద్య విద్వాన్. వైద్యాచార్య హస్తప్రయోగం, నరముల బలహీనత. అంగము చిన్నదగుట. శీఘ్రస్కలనము. శుక్లనష్టము, సుఖరోగములకుమానసికవ్యాధులకు శాస్త్రీయ చికిత్స

విదేశీ యంత్రములతో ప్రత్యేక చికిత్స. పోస్టు ద్వారా కూడా చికిత్స గలదు.

రావూస్ క్లినిక్

టి.బి. రోడ్. తెనాలి. ఫోన్ : 700.

ఉందని శివరాజు కళ్ళొక్కక్షణంలో ఆకళింపు చేసుకున్నాయి.

ఆమెకా ఛాన్సుని ఇవ్వకుండా గబుక్కున సిగరెట్టు పీకని అవతల పారేసి, "ఓ మై డార్లింగ్! .... హౌ లవ్లీ యూ ఆర్?" అంటూ గబుక్కుని గట్టిగా కావలించేసుకున్నాడు.

సీత కోపం మంచులా కరిగిపోయింది.

తరువాత అయిదు నిమిషాలకల్లా, చక్కగా బుద్ధిమంతురాలిలా శివరాజు పక్కని నిమ్మదిగా నడుస్తోంది థియేటర్ కేసి.

పెళ్ళయాక రెండు మూడు నెల్లపాటు ఎన్నో విధాలుగా ఆలోచించింది సీత శివరాజుచేత స్మోకింగ్ మాన్పించటం ఎల్లాగా అని. ఆమెకేమీ అంతుపట్టలేదు. రోజు రోజుకీ పరిస్థితి మరీ అధ్వాన్నంగా అయిపోతోంది.

ఒకానొకరోజు సాయంత్రం శివరాజు కాలేజీనించి వచ్చి సావకాశంగా దినపత్రికా పారాయణంలో మునిగి ఉన్నాడు.

పనవగానే వచ్చి మెల్లిగా శివరాజు ప్రక్కనున్న కుర్చీని ఆక్రమించింది సీత.

"అసలు నాకో సందేహం వస్తోందండీ! ..."

"ఏఁవిటి?" అన్నట్లుగా పేపరులోంచి తలెత్తాడు శివరాజు.

"...నేనెప్పటికైనా మీచేత ఆ సిగరెట్లు మాన్పించగల్నా అని...."

శివరాజేం పలుకలేదు. ముందు నుయ్యి వెనక గొయ్యిగా వుంది శివరాజు పరిస్థితి. యస్! మాన్పించగలవు! అంటే. అవుతే మానెసెయ్యండి అని చంపేస్తుంది. లేదూ - మాన్పించలేవోయ్ - అన్నాడా? - అమ్మో! ఇంకేమైనా వుందా! "మీకు నామీదున్న ప్రేమ ఇంతేనా? మీరు నాకిచ్చే విలువింతేనా?" అంటూ ప్రశ్నల పరంపరని గుప్పించేస్తుంది. అందుకనే అతను కిక్కురుమన్లేదు.

మళ్ళీ సీతే ఎత్తుకుంది-"అసలు సమస్య అది కాదులెండి. మీకుండాలి ఆ ఇంగితం. మీరు అంతగా ఆ పాడు అలవాటుకి బానిసైపోయాక నేనైనా ఎవరైనా చేసేదేముంది?.... ఇప్పుడు ఖచ్చితంగా తేలాల్సిన విషయం మీరు అసలు ఈ జన్మకి సిగరెట్లు మానగలరా? అని" ఆమె చేస్తున్న సవాలు అతని అహాన్ని దెబ్బతీసింది.

"మరీ అంత ఫూలిష్‌గా మాట్లాడకు సీతా! నేనేమంత చచ్చు వెధవననుకున్నావా? అనుకోలేదుగానీ ఈ బోడి సిగరెట్లు మానెయ్యటం ఎంతసేపు!"

"ఆ! అంత సులభంగా చెబుతున్నారే. ఒక్కరోజు ఒక్కటంటే ఒక్కరోజు సిగరెట్టు ముట్టకుండా ఉండండి చూద్దాం".

"ఓయబ్బ! పందెంకాయనా పరి! రేపంతా ఉండి చూపిస్తా చూసుకో" అన్నాడు శివరాజు రోషంగా.

"ఇంట్లో ఉన్నంత సేపూ ఎలాగోలా తంటాలుపడి, కాలేజీకి వెళ్ళాక, ఆఁ! పిల్ల చూడొచ్చిందా అనుకొని గమ్మున తాగెయ్యొచ్చనుకుంటున్నారేమో. అదేమీ కుదరదు. రేపు ఆదివారం. ప్రొద్దుట్నించీ బయటికి కాలుపెట్టకుండా సిగరెట్టు ముట్టకుండా ఉండాలి... సరేనా?"

మాటనేశాడుగా- సరేననక తప్పింది కాదు శివరాజుకి. ఆవాళ రాత్రే ఓపికున్నంతసేపూ గంపెడన్ని సిగరెట్లు తాగేసి మరీ పడుకున్నాడు.

మరుసటిరోజు మామూలుగా తెల్లారింది. ఎనిమిది గంటలయినా ఇంకా ముసుగు తియ్యలా శివరాజు.

శివరాజుకి బెడ్ కాఫీ అంటే పరమ ఇష్టం. బెడ్‌లోంచి లేవకుండానే వేడివేడి కాఫీ తాగి మళ్ళీ పడుకుని సిగరెట్ కాల్చాలంటే ఇంకా ఇష్టం.

కానీ ఆదివారాల్లో, సెలవు రోజులవుతే తప్ప బెడ్ కాఫీ ఇవ్వదు సీత. ఎందుకంటే బెడ్ కాఫీ ఇచ్చిందాకా ఎంతకీ మంచం దిగడు. తరవాత ఎంతో సేపటికి

లేచి టైమైపోయిందని ఒకే హడావిడి పడి పోతూ సీత కూడా రన్నింగ్ రేస్ పెడ తాడు- అందుకని లేచిముఖం కడుక్కుంటే తప్ప కాఫీ ఇవ్వదు సీత.

కాబట్టి ఆదివారం అంటే ఏడూ, ఏడు న్నరకల్లా దుప్పటి ముసుగు తియ్యకుం డానే "సీతా! కాఫీ..." అని కేకేస్తాడు శివరాజు.

ఆవాళ ఎంతసేపటికీ పిలుపు రాకపోయే సరికి, సీతే దగ్గరికొచ్చి, ముఖం దగ్గర చిన్నగా దుప్పటిలాగి చూసింది.

మేలుకునే ఉన్నాడు శివరాజు. కానీ సీత దుప్పటి తీసేసరికల్లా దొంగనిద్ర నటిస్తూ గట్టిగా కళ్లు మూసుకున్నాడు.

"హాయ్! ఏవిటదీ? టైము ఎంతయిందో తెల్సా? ఇవాళ్టికింక లేవరేమిటీ? కాఫీ వద్దూ?" అంది సీత.

పలక్కుండా ఇంకా గట్టిగా కళ్ళు మూసుకున్నాడు శివరాజు.

అతని రెండు బుగ్గలమీదా చేతులేసి నొక్కుతూ "లేస్తారుగా?.... వెళ్ళి కాఫీ తేనా?" అంది గోముగా.

"ఛీ! నాకేం కాఫీ వద్దు! నువ్వే తాగు పో" అన్నాడు అలకతో చిన్నపిల్లాడిలా.


సీతకి నవ్వొచ్చింది.

"ఎందుకమ్మా పాపం? ఎందుకొద్దూ?" అంది సాగదీస్తూ మరింత చిన్నపిల్లలా.

"కాఫీ తాగితే ఏం లాభం? ఇవాళ్టికి సిగరెట్లు లేవుగా?" అనేసి అటువైపు తిరిగి పడుకున్నాడు శివరాజు.

ఇప్పుడర్థమయింది సీతకి విషయం. అటువైపు తిరిగి నవ్వుకుని "అయితే ఇంకాస్సేపు పడుకోండి! నాదేం పోయింది" అంటూ లోపలికెళ్ళిపోయింది.

తొమ్మిదిన్నరకి లేచి తీరిగ్గా మొఖం కడుక్కున్నాడు శివరాజు. మెల్లిగా వంటింట్లోకి వచ్చాడు. కాఫీ అడుగుతాడేమో అనుకుంది సీత. ఉహూ! అడగలే! చాలా సీరి



యస్‌గా కప్‌బోర్డు దగ్గిరకెళ్ళి ఫ్లాస్కు, కప్పు తీసుకు పోసుకుని గబగబా కాఫీ తాగేసి బయటకెళ్ళి పేపరు చూస్తూ కూర్చున్నాడు.

శివరాజు చేష్టలూ, ఆ గాంభీర్యమూ చూస్తోంటే సీతకి పట్టలేనంతగా నవ్వొస్తోంది.

అల్లాగే మధ్యాహ్నందాకా శివరాజేమి మాట్లాడలేదు. భోజనం టైములో కూడా అంతే.

సాయంత్రమయేసరికి శివరాజు పట్ల హ్యూమరస్ సెన్స్‌పోయి. జాలి చోటు చేసుకుంది సీత మనసులో. పోని పందెం బ్రేక్ చేసి ఒక్క సిగరెట్ తాగమందామా అనుకుంది. కానీ మళ్ళీ పట్టుదల అడ్డొచ్చింది.

సాయంత్రం కాఫీతాగి మళ్ళీ ఏదో పుస్తకం చదువుతూ కూచున్నాడు శివరాజు. వంటింట్లోంచి చాలా సార్లు బయటికొచ్చి తొంగి చూసింది సీత - ఏం చేస్తున్నాడో ఈయన అని.

శివరాజు కండిషన్ చాలా పాథటిక్‌గా ఉంది. రెండు నిమిషాలు చదువుతాడు. అంతలో తలెత్తి కాస్సేపు ఏదో ఆలోచిస్తాడు మరింత సేపు కిటికీలోంచి బయటికి చూస్తాడు ఏదో దిగులుగా. అతని మొఖం ఏదో పోగొట్టుకున్నట్టుంది.

ఇక చూడలేకపోయింది సీత.

గబగబా లోపలికెళ్ళి, సిగరెట్ పెట్టె అగ్గిపెట్టె తెచ్చి అతని దగ్గర ఉన్న ఓ స్టూల్ మీద ఉంచింది పర్మిషన్ ఇస్తోన్నట్లుగా.

శివరాజులో మార్పేమీలేదు. ఇక లాభం లేదనుకుని, తనే సిగరెట్ తీసి అతని నోట్లో ఉంచి. అంటించి, బుగమీద చిన్నగా ముద్దు పెట్టింది చిన్నపిల్లాడికి మల్లే.

కరిగిపోయాడు శివరాజు. సీతని దగ్గరికి లాక్కుని సీత పెదవులమీద గట్టిగా ముద్దెట్టుకున్నాడు. సిగరెట్టు వాసన గుప్పుమని కొట్టినా సీత ఏమీ అనకుండా మెల్లిగా లోపలికెళ్ళిపోయింది.

మాన్పించలేనని ఖాయం చేసుకున్నాక, కనీసం మినిమైజ్ అయినా చేద్దామని ప్రయత్నించింది.

అప్పటినుంచీ సిగరెట్ల దొంగతనం ప్రారంభించింది సీత. ప్రతిరోజూ శివరాజు ఇంటికి రాగానే, సిగరెట్ పాకెట్‌లో రెండే సిగరెట్టుంచి మిగతావన్నీ దాచేసేది. మొదట్లో శివరాజంతగా గుర్తించలేదు. ఒకరోజు హఠాత్తుగా అనుమానం వొచ్చిందతనికి. ఇంటికొచ్చేప్పుడు ఏంచుకుని వచ్చాడు. అతను మొఖం కడుక్కుని వచ్చి తాగి చూసేసరికి రెండే వున్నాయి. వెంటనే తెలిసిపోయింది.

"సీతా" అని పిలిచాడు గట్టిగా.

"ఏమిటీ కేకలు," అంటూ బయటికొచ్చింది సీత.

"ఇందులో ఆరుండాలి, రెండే ఉన్నాయేమిటోయ్ సిగరెట్లు?"

"నాకేం తెలుసు - అయినా ఏమిటి లెక్కలు అడగడం. నేమగాని సిగరెట్లు తాగుతానా ఏమిటి? ఏమో! నాకెందుకు బాబూ ఈ గొడవ" అంటూ మళ్ళీ వంటింట్లోకి దూరింది. శివరాజు తన రహస్యం కనుక్కున్నాడని తెలుసుకుంది సీత.

సీత సిగరెట్లు దాస్తుందని శివరాజుకి తెలిసిపోయింది. కాని సీత ఎంత మొండిదో అతనికి తెలుసు. కాబట్టి తాను తీసినట్లు ఒప్పుకోదనీ తెలుసు.

పెళ్ళైనప్పట్నించీ ఇంట్లో పెత్తనం సీతదే. అందుకని శివరాజు మళ్ళీ పెళ్ళి సిగరెటకి డబ్బివ్వమని చచ్చి గీపెటినా ఇవ్వదని, నెల మొదట్లోనే సరిగ్గా ఏభై రూపాయల సిగరెట్లు పాక్ తెచ్చుకుని మిగతా దంతా సీత చేతిలో పోసేవాడు. అటు తరవాత సీతదే రాజ్యం. ఒక్క సిగరెట్టు తప్పించి బయట ఏకాంగానూ జల్సా చేసే అలవాటు లేదు శివరాజుకి.

సీత లెఖ్ఖ ప్రకారం అవుతే ఈ నెల ఇరవయ్యో తారీఖు కల్లా సిగరెట్లు అయిపోవాలి.

సరిగా పద్దెనిమిదో తారీఖున సీత అన్నయ్య ఊడిపడ్డాడు.

"నాగుల చవితికి మిమ్మల్ని దగ్గర్నే తీసుకురమ్మందోయ్ వాళ్ళ వదినె. నువ్వు సెలవు పెట్టెయ్యరాదూ? వెళ్దాం!" అనడిగాడు శివరాజుని.

"లేదులేరా! ఇప్పటికే డిగ్రీ స్టూడెంట్స్‌కి సెకెండ్ ఇయర్ సిలబస్ పూర్తి చెయ్యలేదని ప్రిన్సిపాలు ఏడుస్తున్నాడు. ఇంకా నాలుగైదు రోజులు లీవు కావాలంటే గొడవ పెడతాడు. సీతని తీసికెళ్ళిపో!" అన్నాడు.

"సరే! అలాగేకానీ మళ్ళీ ఎప్పుడు పంపించమంటావ్ సీతని? వారం రోజుల తర్వాత వచ్చి వదిలి పెట్టనా?"

"మళ్ళీ నువ్వొచ్చి వదిలి పెట్టడం ఎందుకూ? మీ చెల్లిని ఎవరూ ఎత్తుకుపోర్లేవోయ్ ...అయినా నువ్వేమనుకుంటున్నావోగానీ, ఈ పిల్ల నిన్నూ, నన్నూ కలిపి బజార్లో పెట్టి అమ్మెయ్యగలదు తెల్సా? రైలెక్కించే సెయ్ వస్తుంది"

సీతకి ఛర్రుమని మండింది. వెంటనే అందుకుంది. "ఎక్కించటంకూడా ఎందుకూ? నే నెక్కలేనేంటి ఆ మాత్రం" అంది ఎకసక్కెంగా.

"పరిస్థితి శ్రుతిమించుతోందని గ్రహించుకున్న సీత అన్నయ్య "శివా! నీకు కాలేజీకి టైమవలేదట్రా? వెళ్ళి భోంచెయ్యరాదూ?" అన్నాడు మాట మారుస్తూ.

సీతకి నిజానికి మొగుణ్ణి వదలి వెళ్ళటం అంతగా ఇష్టంలేదు. కానీ అతనే అంతఇదిగా "నువ్వు వెళతావా సీతా?" అని ఒక్కమాటైనా అడక్కుండా తీసికెళ్ళిపోమని చెప్తూంటే తనెందుకంత గిక్కుని చావాలి? "వెళితే నాలుగు రోజులూ ఈ చాకిరీయేనా తప్పుతుంది. అయినా ఈ మగాళ్ళకి పెళ్ళయిన కొత్తలో వున్నంత ప్రేమ ఐదారు నెల్లకి వుండదు. ఈ రోగానికి అప్పుడప్పుడూ ట్రీట్‌మెంట్ యిస్తోండాలి. నాలుగు రోజులు దూరమయితేతప్ప పెళ్ళాం విలువ తెలుసుకోలేరు!" అనుకుంది.

సరిగా ముప్పయ్యయిదు రూపాయలు మాత్రమే అతని పెట్టెలో వుంచేసి మధ్యాహ్నం బండికే అన్నయ్య వెంబడి వెళ్ళిపోయింది.

జల్సాగా, పుట్టింట్లో ఎంజాయ్ చేద్దామనుకుందిగానీ, ఆ ఆలోచన్లో తానెంత పొరపాటు చేసిందో మొదటరోజే తెలిసొచ్చింది సీతకి.

వచ్చినప్పట్నుంచీ టిఫిన్ చేస్తున్నా, భోజనం చేస్తున్నా, పడుకున్నా, కూచున్నా, లేచినా మనసంతా శివరాజుమీదే - ఎట్లా వున్నాడో ఏం చేస్తున్నాడో అని.

అసలైన అనుభవంలేని వాళ్ళకి ఇలాంటిది చూస్తే భలే నవ్వొస్తుంది. ఎందుకంటే నిన్న మొన్నంటే శివరాజు సీత

# రసవాదులు

వాళ్ళు
కాలాన్ని సిగరెట్లతో తగలేస్తూ
'టీ'లో ఆవేశాన్ని నంజుకుంటూ
కవిత్వాన్ని గూర్చి
రసాన్ని గూర్చి
కవితా తత్వాన్ని గూర్చి
సిద్ధాంత శాసనాలు నాటుతున్నారు.
మురికిలో
టేబుళ్ళ మురికిని తుడుస్తున్న
ఏడు సంవత్సరాల పసిచేయి
భవిష్యత్తు పసిచేయి
వాళ్ళకి కన్పించలేదు.

—కె. శివారెడ్డి




మొగుడయ్యేడుకాని, అంతకుముందంతా ఒంటరిగా ఉండలే! పుట్టి బుద్ధెరిగినప్పట్నుంచి, సీత దగ్గరుందేవిటి? అలాంటప్పుడు ఈ మొగారు ఓ నాలుగు రోజులుదగ్గర లేందే అతనేమైపోతాడు? అన్పిస్తుంది.

అందులోనూ సీత శివరాజుని ప్రేమించి మరీ పెళ్ళిచేసుకుందాయరి! అలాంటప్పుడు శివరాజుతో ఎంత దగ్గరగా కనెక్షన్ ఏర్పడుంటుందో వేరుగా చెప్పాలా?

చాకిరీ తప్పుతుందనుకున్న సీతకి ఇలా ఊరికినే కూచోవటం పనిష్మెంట్‌లా తోచింది.

కొన్ని రోజులు దూరంగా ఉంటే తన విలువ శివరాజుకి తెలిసొస్తుందని అనుకుంది– కానీ– నిజానికిప్పుడు శివరాజు విలవే సీతకి తెలిసొస్తూంది దూరమవటంతో. రెండ్రోజులుండి వెళ్ళిపోదామంటే సిగ్గేసింది – అన్నయ్యా, వదినా నవ్వుతారేమోనని.

రాగానే సీత రాసిన ఉత్తరానికి జవాబు రాలేదు. ఉత్తరాలు రాయటంలో శివరాజు కెంత సోమరితనమో సీతకి బాగా తెలుసు. అయినా కొంపదీసి ఏదేనా జబ్బుగాని పడ్డాడేమోనని బెంగపట్టుకుంది.

ఇక ఉండలేకపోయింది – వారం తిరగ్గానే చిన్న అబద్ధమాడేసింది వాళ్ళన్నయ్యతో–"ఆయన రమ్మని రాశారు. వెళతా"నంది. సెలవు లేకపోటంతో శివరాజు చెప్పినట్లుగానే రైలెక్కించి పంపించేశాడు సీతని సీత అన్నయ్య.

సీత ఇంటికొచ్చేసరికి సాయంత్రం ఆరుగంట లయింది. శివరాజు మాసిన గడ్డంతో దేవదాసులా తయారయి, ఈజీ ఛైర్లో కూచుని సిగరెట్లు తాగేస్తున్నాడు.

నిజానికి శివరాజులో పెద్ద మార్పేమీ లేదు. అయినా సీతకి అతని బుగ్గలూ కళ్లూ లోతుకు పోయినట్లనిపించింది. చేతులూ కాళ్ళూ రెండూ పుల్లల్లా వేళ్లాడుతూన్నట్లు తోచింది. ఇంకా ఏమేమో అయినట్లన్పించింది.

చేతిలో సంచవతల పారేసి పరిగెత్తుకెళ్ళి కావిలించేసుకుంది శివరాజుని. ఉక్కిరిబిక్కిరయిపోయాడు శివరాజు.

తరవాత సీత కళ్లు గబగబా ఇంటిని సర్వే చేశాయి, ఇంట్లో ప్రతీమూలా ఒక డస్ట్‌బిన్‌లా వుంది–మూలమూలనా సిగరెట్ పీకలూ, అగ్గిపుల్లలే.

"అబ్బ! ఏం కాల్చేశారండి బాబూ! ఇలా అయితే మీ ఆరోగ్యం ఏ గతి పట్టేనూ!" అంది గాభరాగా.

"మరి నేనేం చెయ్యానోయ్! అసలు నువ్వెందు కెళ్లాలీ నన్నొదిలేసి" అన్నాడు తప్పుని సీత నెత్తిన రుద్దేస్తూ.

"అవును వెళ్ళటం నాదే పొరపాటు" అనుకుంది సీత.

ఇంటినంతా ఓ కొలిక్కి తెచ్చి, వంటకి ప్రారంభించింది సీత. ఇప్పుడొచ్చింది అసలయిన డౌటు ఆమెకి. తను చాలా గీసి

నట్టుగా డబ్బుంచిందే డబ్బు! దాంతో ఆయన సిగరెట్లే తాగాడా? భోజనం చేశాడా? ఏం చేసినట్లు? శివరాజుకి అప్పుచేసే అలవాటు లేదు. ఒకవేళ అతను చేద్దామన్నా, నెలాఖరు రోజుల్లో ఎవరి దగ్గరా డబ్బు కాదు గదా సిగరెట్లేనా అరువుకి దొరకవు. అందరూ డబ్బులకి నాలుక పీక్కుంటూనే ఉంటారు. సీతకేమీ పాలుపోలేదు. వున్నట్లుండి ఒక చిన్న అనుమానం వచ్చింది. గబగబావెళ్ళి తన పెట్టి తెరిచి బట్టలన్నీ లాగి చూసింది ఎందుకో తెలుసా: డబ్బేమైనా దాచి ఉంచిందేమో అనుకుంటే మీరు పప్పులో కాలేశారన్న మాటే, అక్కడ దొంగిలించిన సిగరెట్లన్నీ దాచిపెట్టింది సీత. ఇప్పుడక్కడ మచ్చుకి ఒక్క సిగరెట్టుంటేఒట్టు. జరిగిన మోసం తెలిసిపోయింది.

దీంతో సీతకి పూర్తిగా విసుగొచ్చేసింది. "ఇక లాభంలేదు. ఈయనచేతసిగరెట్లు మాన్పించటం కాదుకదా తగ్గింపించటమైనా ఆ బ్రహ్మతరం కూడా కాదు." అని రూఢీ చేసుకుంది. ఇంక అవాళనించి తన యాంటిస్మోకింగ్ కాంపెయిన్‌ని రద్దు చేసి పారేసింది. సిగరెట్ల పిచ్చి శివరాజుని అతని మానాన అతన్ని వదిలేసింది.

అయిదారు నెల్ల తరవాత ఒకానొక రోజు సీత శివరాజు ఎకౌంటు బుక్కు చూసింది కాకతాళీయంగా. శివరాజుకి ఓ మంచి అలవాటుంది. మామూలుగా తను పెట్టే ఖర్చులన్నీ ఒక డైరీలో రాస్తాంటాడు. తానెప్పుడూ చెక్ చేయకపోయినా సీతచేతకూడా అదే అలవాటు చేయించాడు.

ఆ నెలలో సిగరెట్ల లెక్క చూసింది. ఇరవయి రూపాయలుంది అక్కడ. ఏభై నుంచీ ఇరవయికి ఎలా దిగిందో అర్థం కాలేదు. సీత తన కళ్ళని తనే నమ్మలేకపోయింది.

సీతకి ఈ పజిల్ ఏమిటో అర్థంకాలేదు. శివరాజు స్మోకింగ్ గూర్చి తాను పట్టించుకోడం మానేసింది. కానీ ఇంతగా ఎల్లా తగ్గించగలిగాడో ఆమెకి బుర్ర బద్దలు కొట్టుకున్నా అర్థమవలేదు.

* * *

ఇప్పుడు శివరాజు సిగిరెట్లు తగ్గించడానికి ఒకే కారణం ఉంది. అది సీత సిగరెట్లు మానమనే పోరుని అపటమే— ఇంకో రకంగా చెప్పాలంటే సీత తన యాంటీ స్మోకింగ్ కాంపెయిన్‌ని రద్దుపరచడమే శివరాజు స్మోకింగ్ మినిమైజేషన్‌కి కారణమై కూచుంది. ★

## వింత

అల్లుడు అందంగా ఉన్నాడని అమ్మ అంటే
అమ్మాయికి అనుమాన మొచ్చిందట!
సమసమాజం బావుంటుందని
అమ్మ అవు అంటే "దూడ"లకు కోపం వచ్చిందట!!

—కోరాడ నాగేశ్వరరావు